


# మనం

## కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

బుధవారం | 9 | ఆగస్టు | 2023 | పేజీలు : 7


# అభివృద్ధి పనులను శంకుస్థాపన



### వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను బతుకమ్మ పండుగలోగా పూర్తి చేయాలి

### మంత్రి కెటిఆర్

వేములవాడ టౌన్, ఆగస్ట్ 8 (మనం న్యూస్): వేములవాడ పట్టణంలో మంగళవారం ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ , కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవిలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొదట వేములవాడ పట్టణంలోని నంది కమాన్ జంక్షన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం చింతలతండా గ్రామపంచాయతీలో 42 డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా దవాఖానలో డయాలసిస్ సెంటర్, డీఈఐసీ సెంటర్, మాతృసేవా కేంద్రాలను, హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంటును ప్రారంభించారు. మూలవాగు బండ్ పార్క్, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని, మూల వాగు వద్ద అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ను, శ్యామకుంట జంక్షన్ వద్ద కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు.

ఆ వెంటనే గుడి చెరువు అభివృద్ధి పనులకు, బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భక్తుల సౌకర్యార్థం 100 గదుల కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను బతుకమ్మ పండుగలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, మూడు షిఫ్ట్ లలో మిషన్ మోడ్ లో పనులు చేపట్టాలన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలన్నారు. పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్య ప్రసాద్, ఎన్.ఖీమ్యా నాయక్, ఆర్డీఓ మధుసూదన్, ఆలయ కార్యనిర్వణాధికారి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

### కలెక్టర్‌కు తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ వినతి పత్రం

కరీంనగర్, ఆగస్ట్ 8 (మనం న్యూస్)ః జిల్లా వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం టిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రత్యే క తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల సమస్యలు పరిష్క రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం వార్తా సేకరణలో సతమవుతున్న జర్నలిస్టుల్లో అనేక మంది సొంత ఇండ్లు లేకుండా అద్దె ఇండ్లలో నివసిస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ నివేశనా స్థలాలు అందించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జిల్లాలోని జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలని కోరుతూ గతంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్, అప్పటి కలెక్టర్ కర్ణన్ కు వినతి పత్రం అందజేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా మంత్రి కమలాకర్, జిల్లా కలెక్టర్ గోపిలు స్పందించి, ఇండ్ల స్థలాల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదె కరుణాకర్ రావు, సంఘ సభ్యులు శంకర్ రెడ్డి, హరికృష్ణ, నరేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



### జీఓ 59క్రింద భూముల క్రమబద్దీకరణ రుసుం వసూలుకు ప్రత్యేక కార్యచరణ

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్





2 లో

# జీఓ 59క్రింద భూముల క్రమబద్ధీకరణ రుసుం వసూలుకు ప్రత్యేక కార్యచరణ

పెద్దపల్లి, ఆగష్టు 08(మనం ప్రతినిధి): ప్రభుత్వ జీఓ 59 క్రింద భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి నిర్ధేశించిన రుసుము వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వీసి హాల్‌లోజీఓ 59భూముల క్రమబద్ధీకరణ, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి పథకం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లతో కలిసి మంగళవారం తహాశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు 59క్రింద మొదటి దశలో మనజిల్లాలో క్రమబద్ధీకరణ కోసం 664మంది దరఖాస్తుదారులలో ఇప్పటివరకు 27వరకు మాత్రమే పూర్తిగా నిర్ధేశించిన రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నారని, 10మంది వరకు మొదటి, రెండు విడతల చెల్లింపు చేశారని, 627మంది దరఖాస్తు దారులు రుసుము చెల్లింపు ప్రక్రియ ప్రారంభించలేదని, ప్రత్యేక కార్యచరణ అమలు చేసి నిర్ధేశించిన రుసుము వసూలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 59క్రింద రెండవ విడతలో వచ్చిన దరఖాస్తులను నిర్ధేశిత సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని ఆసమయంలోనే రుసుము చెల్లింపు ప్రక్రియ గురించి లబ్దిదారులకు వివరించాలన్నారు. అలాగే ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 10వరకు గృహలక్ష్మి పథకం క్రింద దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం గడువు నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. మండలాల పరిధిలో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటు గృహలక్ష్మి పథకం దరఖాస్తు అంశం విస్తృతంగా ప్రజలకు చేరేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రతి తహాశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యా లయం, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. పాలకుర్తి మండలంలోని ఎసాల తక్కల్లపల్లి, మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్, సుల్తానాబాద్ మండలంలోని రెబ్బల్‌దేవ్‌పల్లి, శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామాలలో బలహీన వర్గాలకు ఇంటిస్థలాల పంపిణీ కోసం 11ఎకరాల భూమి అందుబాటులో ఉందని, వీటిని 442ప్లాట్లుగా విభజించామని, 132ప్లాట్ల ఇంటి పట్టాలను లబ్దిదారులకు పంపిణీ చేశామని, పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాల పంపిణీ కోసం బలహీన వర్గాల నుంచి అర్హులైన లబ్దిదారులను గుర్తించి పంపిణీ పూర్తయ్యే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ పుష్పలత, తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## బిసి, ఎంబిసి కులవృత్తిదారులకు రూ.లక్ష గ్రాంట్ పంపిణీ చేసిన కెటిఆర్



రాజన్న సిరిసిల్ల ఆగస్ట్ 8, (మనం న్యూస్): జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆరువందల మంది బిసి, ఎంబిసి కులవృత్తి దారులకు ప్రభుత్వం నుండి మంజూరైన లక్ష రూపాయల గ్రాంట్ చెక్కులను మంగళవారం మంత్రి కె టిఆర్ పంపిణీ చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు, రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్‌లు జిందం కళా చక్రపాణి, రామతీర్థపు మాధవి, అదనపు కలెక్టర్ లు బి.సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్, జిల్లా బిసి అభివృద్ధి అధికారి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి ఎల్‌వోసి అందించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి



భీంగల్, ఆగస్టు 8 (మనం న్యూస్): ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ తో అనారోగ్యానికి గురై సర్జరీ కోసం నిమ్స్ హాస్పిటల్‌లో చేరిన మెండోరా మండల కేంద్రానికి చెందిన రాజ్ కుమార్‌కు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రెండు లక్షల రూపాయల విలువైన ఎల్‌ఓసిని మంగళవారం అందించారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో బాధితుని కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసిని అందజేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మామిడి అంజయ్య



చిగురుమామిడి, ఆగస్టు 8 (మనం న్యూస్)ః లంబాడి పల్లె గ్రామంలోని బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్త మంద పోచయ్య తండ్రి రాజయ్య, హనుమాన్ల ప్రతాపరెడ్డి తండ్రి మల్లారెడ్డిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి, ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షులు పెనుకుల తిరుపతి, ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, నాయకులు నాగెల్లి రాజిరెడ్డి, ఐరెడ్డి అనంతరెడ్డి, సందబోయిన శ్రీనివాస్, కాటం శ్రీనివాస్ రెడ్డి, మంద లక్ష్మణ్, నాగరాజు, కిష్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కోరుట్లలో కౌన్సిలర్ భర్త దారుణ హత్య

### కత్తులతో దాడి జరిపిన గుర్తు తెలియని దుండగులు



కోరుట్ల, ఆగస్టు 7 (మనం న్యూస్)ః జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో దారుణ హత్య జరిగింది. పట్టణంలోని బిఆర్ఎస్ కు చెందిన తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ పోగుల ఉమారాణి భర్త లక్ష్మిరాజంను మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో నడీ రోడ్డు మీద అందరూ చూస్తుండగానే కత్తులతో పొడిచి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన లక్ష్మిరాజంను కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 9వ వార్డుకు చెందిన పోగుల ఉమారాణి భర్త లక్ష్మి రాజం ఉదయం టీ తాగడానికి జాతీయ రహదారికి అనుకుని ఉన్న పాత మున్సిపల్ పక్కన ప్రకాశం రోడ్ లో గల ఒక ఛాయ్ హోటల్లో కూర్చున్నాడు. అంతలో ఆయన వెనుక నుంచి మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వచ్చి కత్తితో మెడ ప్రాంతంతోపాటు పొట్టపైన దాడి చేసి, అతనితో వచ్చిన మరో వ్యక్తి బైక్‌పై పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆయనను చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా, ఆస్పత్రిలోనే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్‌లు పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తనయుడు కల్వకుంట్ల సంజయ్, భరత్, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అనీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, స్థానిక కౌన్సిలర్లు లక్ష్మీరాజం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



తిమ్మాపూర్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుండి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బి.వినోద్ కుమార్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్‌లు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జివి.రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్, రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు గూడెల్లి తిరుపతి, జెడ్పిటిసి సభ్యులు మాడ్గుల రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంప వెంకన్న, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్




మెట్ పల్లి, ఆగస్టు 8 (మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ పల్లి పట్టణంలోని 26 వార్డుల ప్రజలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం మూడు లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 120 వరకు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. మహిళల పేరు మీద ఉన్న సొంత స్థలం ఉండి ఇల్లు లేని పట్టణ నిరుపేదలు ఈ గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి, మున్సిపల్ ఉద్యోగులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## రెండువ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్ కోసం

# సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డు ఉద్యమం

### కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలన్నీ పర్మనెంట్ చేస్తానని ఇంతవరకు చేయలేదని ఆవేదన



సుల్తానాబాద్,ఆగస్టు 08 మనం న్యూస్ ః తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నాయకుడిగా ఉన్న సీఎం కేసీఆర్ అధికారంలోకి వస్తే ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగాలే ఉండవని అన్ని రెగ్యులర్ చేస్తామని అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని అన్ని పీహెచ్సీ కేంద్రాలలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు సీఎం కేసీఆర్ కు పోస్ట్ కార్డు ద్వారా తమను రెగ్యులర్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించి రెండవ ఏఎన్ఎంలు సంఘం జిల్లా నాయకురాలు స్వరూప రాణి రెండువ ఏఎన్ఎంలు రమాదేవి ,కవిత, శారద,భూలక్ష్మి, వీణ,రాజేశ్వరి ,రజిత ,పద్మాంజలి తదితరులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినట్లు వీఆర్ఏలను పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించినట్లు తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 16 ద్వారా ఏప్రిల్ 30 నా 55 54 మందిని రెగ్యులరైజేషన్ చేసి రెండ వ లను రెగ్యులర్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్‌హెచ్ఎంలో కాంట్రాక్టు పద్ధతిలో గత 15,16 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తూనే మమ్మల్ని రెగ్యులరైజేషన్ చేయాలని వినతి పత్రాలు సమర్పించుకుంటూ వస్తున్నామని అయినా మమ్మల్ని గుర్తించలేదని అందుకనే మేము తెలియాలనే వివిధ రకాల పద్ధతిలో ఆందోళన కార్యక్రమాల ద్వారా సీఎం కేసీఆర్ దృష్టికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం జూలై 24న 1520 మంజూరు చేయడం ద్వారా మమ్మల్ని గుర్తించకపోవడం మాకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెయిటేజ్ మార్కులు కాదు కానీ ఆ పోస్టులలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి రెండవలను రెగ్యులర్ చేసిన తర్వాత మిగతా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఇప్పుడు ఇచ్చినటువంటి నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి సీఎం కేసీఆర్ 9 సంవత్సరాల పాలనలో కుటుంబ సంక్షేమశాఖ ఏర్పరచుకున్న ప్రతి లక్షాన్ని నెరవేర్చడంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వకున్న అధిక పనిభారంతో ఇబ్బందులు ఎదురై ఎంతోమంది రెండు ఏఎన్ఎంలు రాష్ట్రవ్యాప్తంగా గుండెపోటుతో వివిధ రోడ్డు ప్రమాదాలలో చనిపోయి వారి కుటుంబాలు జబారున పడ్డాయని మాకు కనీసం ఉద్యోగ భద్రత కూడా లేకుండా పోయిందని ఇదే నా కేసీఆర్ అనుకున్న బంగారు తెలంగాణ అని వారు ప్రశ్నించారు. మాకు ఇచ్చే జీవితంలో సగం జీతం ఆటో ఖర్చులకు ప్రయాణాలకే ఖర్చవుతున్నాయని మా యొక్క కుటుంబాలు దుర్భర జీవితంలో కొట్టుమిట్టాడుతున్నాయని అయినా కానీ ప్రభుత్వానికి మమల్ని గుర్తించపోగా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. పనిభారంతో అధికారుల వేధింపులతో ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ ఉద్యమంలో మేము కూడా భాగస్వామ్యమై తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అందరి బతుకులు బాగు పడతాయి అనుకుంటే మా బతుకులు దరిద్రంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి మేము చేయలేని విధులను కూడా మాతో చేపిస్తున్నారని చేయకపోతే మెమోలు ఇస్తామంటూ పై అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు స్పందించి వెంటనే క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తం గా విధులు నిర్వహిస్తున్న రెండవ లను రెగ్యులరైజేషన్ చేసి మమ్మల్ని ఆదుకోవాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తుమని రెండవ ఏఎన్ఎంలు హెచ్చరించారు.

## బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలు సత్వరం స్పందిస్తూ సేవలందించాలి

### కరీంనగర్ పోలీస్ అదనపు కమిషనర్ రాజు



కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (మనం న్యూస్)ః బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులు డయల్ 100, ఇతర మార్గాల ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో సదరు ప్రాంతానికి చేరుకుని ప్రజలకు సేవలందించాలని కరీంనగర్ పోలీస్ అడిషనల్ కమిషనర్ సి.రాజు అన్నారు. వేగవంతంగా ప్రజలకు అందించే సేవల ద్వారా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని చెప్పారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులకు సోమవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీలు ముమ్మరంగా నిర్వహించాలన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నియంత్రించబడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలకు వేగవంతంగా సేవలందించేందుకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. విధినిర్వహణలో సమర్ధవంతమైన సేవలందించి, పోలీస్ శాఖ పేరుప్రతిష్టలను పెంపొందించే ప్రతిమంచిపనికి రివార్డులను అందింస్తామని ప్రకటించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులు అందించే సమర్ధవంతమైన విధులు, సేవలను రికార్డుల్లో రాయాలని సూచించారు. శిక్షణల ద్వారా బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధాసక్తులతో ఆలకించాలని, ఈ విషయాలు విధినిర్వహణ సందర్భంగా ఉపయోగపడుతుందనే విషయాన్ని గుర్తించి అంకితభావంతో విధులను నిర్వహించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులపై శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి కాశయ్య, పాల్గొన్నారు.



### కోటి నవదుర్గ మహిళా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోరుట్ల, ఆగస్టు 8 (మనం న్యూస్)ః కోటి నవదుర్గ మహిళా లయన్స్ క్లబ్ అధ్వర్యంలో స్థానిక వాసవి కల్యాణ భవనంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 70 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. ఇందులో ఆపరేషన్ అవసరమున్న 35 మందిని గుర్తించి, రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ అల్లాడి శోభ, క్లబ్ అధ్యక్షురాలు వనపర్తి రమ్య, సెక్రెటరీ కుందారపు ప్రేమలత, కోశాధికారి కొండబత్తిని రాధిక, క్లబ్ సభ్యులు చాప వందన, గుంటుక కవిత, అడేపు కమల, పోల హిమబిందు, జక్కని రజిత, పోలాస గీతా రాణి, రుద్ర సుజాత, గుంటుక వందన, కోరుట్ల లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు గండ్ర దిలీప్ రావ్, గుంటుక చంద్ర ప్రకాష్, అల్లాడి ప్రవీణ్, చాప కిషోర్, పోతాని ప్రవీణ్ కుమార్, వనపర్తి చంద్ర మోహన్, కుందారపు మహేందర్, కొండబత్తిని అనంత కృష్ణ ప్రసాద్, గుంటుక మహేష్, కనపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి వలసల జోరు

సుల్తానాబాద్,ఆగస్టు 08 మనం న్యూస్ ః అధికార బిఆర్ఎస్ షాక్ ఇస్తూ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన వార్డు సభ్యులు గాదే రమాదేవి,రాజరత్నాకర్‌రెడ్డి,మేకల అనూష ప్రశాంత్,సుంకిశాల తిరుపతి రావు, ఎబ్బతి మల్లారెడ్డి,పూడి శ్రీధర్,మాతంగి రాయమల్లు,పొన్నాల స్వరూప రాయమల్లు,శ్రీపతి కిరణ్‌లతో పాటు 30 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు సభ్యులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్వగృహాము ఎలిగేడు మండలం శివపల్లిలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ ప్రజల్లో టిఆర్ఎస్ పార్టీ మీద నమ్మకం పోయినందుని కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరు పెరిగిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అమలుకు నోచుకోని హామీలతో ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి తొయిలాలు ప్రకటిస్తుందని ప్రజలు బిఆర్ఎస్ ను నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌రావు,కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌రావులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్డుకు ఇరువైపులా చెట్లు



సుల్తానాబాద్,ఆగస్టు 08 మనం న్యూస్ ః సుల్తానాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్ళే రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు పెరగడంతో రాకపోకలకు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సుల్తానాబాద్ మండలంలోని కనుకల, తోగార్రాయి, మంచిరామి, సుగ్లాంపల్లి,చిన్న బొంకుర్,పూసాల నుండి నర్సాపూర్ వెళ్లే రోడ్లకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మల రోడ్డు వెంట వెళ్ళే ప్రైవేట్ స్కూల్ బస్సులకు తీవ్ర ఆటంకం కలుగుతున్నాయని కేరళ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ సిజ్జు.ఎస్ నాయర్ అన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు ఇరువైపుల పెరిగిన చెట్ల కొమ్మలకు తొలగించాలని కోరుతున్నారు.

## కులం ఆదాయం లేకునాన గృహలక్ష్మీ పథకానికి మిగతా డాక్యుమెంట్లు పెట్టి దరఖాస్తు చేయండి

### ఎంపీపీ బాలాజీరావు



సుల్తానాబాద్,ఆగస్టు 08 మనం న్యూస్ ః గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు కులం ఆదాయం సర్టిఫికెట్ల కోసం పడిగాడ్పులు కాయవలసిన అవసరం లేదని విచారణ కోసం ఇంకా సమయం ఉన్నందున ఇప్పుడు మీ దగ్గర ఉన్నటువంటి డాక్యుమెంట్లు జతపరిచి గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మీ పథకం ద్వారా మూడు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇల్లు నిర్మాణం చేసే బాధ్యతను తీసుకుంటుందని బాలాజీ రావు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి

# తెలంగాణ ఉద్యమకారుల పాలాభిషేకం



తిమ్మాపూర్, ఆగస్ట్ 8 (మనం న్యూస్): అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యల గురించి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి ప్రస్తావించడం పై తెలంగాణ ఉద్యమ కారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారులు సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మానకొండూరు నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ చైర్మన్ ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి లు మాట్లాడుతూ అసెంబ్లీలో పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి పేర్కొన్న విధంగానే తెలంగాణ ఉద్యమకారుల స్థితిగతులు మెరుగుపడాలంటే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ది చేకూర్చే విధంగా, ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తిస్తూ పెన్షన్ సదుపాయం, హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించే విధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే లు కూడా తెలంగాణ ఉద్యమ కారుల పట్ల మానవతా దృక్పథంతో ఆలోచించి వారికి సంక్షే మ పథకాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు భూమ సదానందం, మామిడి వెంకటయ్య, ఎడ్ల నరసింహా రెడ్డి బొల్లాడి నరసింహారెడ్డి, మామిడి మొగిలి, తాటిపల్లి శంకర్, ఎడ్ల బుచ్చి రెడ్డి, తాటిపల్లి జంపన్న,అశోధ రాములు,వేల్పుల మల్లయ్య, నోముల శ్రీనివాస్, కూనమల్ల మల్లేశం, బైరి సంపత్ కుమార్, దొంగల కనకయ్య, తాళ్ల మల్లయ్య, తదిత రులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలను ప్రారంభించిన జడ్జీలు



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 8 (మనం న్యూస్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో నిర్వహిస్తోన్న ఆటల పోటీలను జిల్లా జడ్జీలు ప్రేమలత, శ్రీలేఖలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోడి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సజ్జానం అనిల్, సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ముకరంపురలో గడప గడపకు కాంగ్రెస్

కరీంనగర్, ఆగస్టు 8 (మనం న్యూస్): నగరంలోని ముకరంపుర ప్రాంతంలో మంగళవారం నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరం నడిబొడ్డున కూడా ప్రజలు సమస్యలతో సతమత మవుతున్నా, పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జామా మసీదు వెనుక భాగంలో రోడ్డు, మురికి కాలువ అధ్వాన్నంగా ఉందని, వర్షం నీళ్లకు మురికి కాలువ నీళ్ళు తోడై రోడ్డు వెంట ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని అన్నారు. మల్టీ పర్పస్ గ్రౌండ్‌ను ఎటు కాకుండ చేశారని పార్కు పనులు గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యుడు పెద్దిగారి తిరుపతి, నాయకులు ఎండి.తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, చంద్రయ్య గౌడ్, కుర్ర పోచయ్య, ఎండి.చాంద్, షబానా మహమ్మద్, పొరండ్ల రమేష్,ముల్కల కవిత,అన్నే జ్యోతి రెడ్డి, మాకల నర్సయ్య, మెతుకు కాంతయ్య, నెల్లి నరేష్,లాయాక్, నిహాల్ అహ్మద్, ముక్క భాస్కర్, ఎగ్గడి శారద,మహమ్మద్ భారీ,మామిడి సత్యనారాయణ రెడ్డి,బషీర్, హనీఫ్, ముల్కల యోన, జిలకర రమేష్, దామోదర్, ఖలీమ్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## వరిని ఆశించి నష్టపరుస్తున్న మొగిపురుగు



వీణవంక-ఆగష్టు 08(మనం న్యూస్): మండలంలోని కిష్టంపేట,ఐలాబాద్, దేశాయిపల్లి, ఘన్ముక్ల,మామిడాలపల్లి గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో వరి పంటను మొగిపురుగు ఆశించి నష్టపరుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు మండలంలో రైతులు సాగు చేస్తున్న 2వేల ఎకరాలకు పైగా వరిపొలాలో మొగిపురుగు ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొగిపురుగు నివారణ గూర్చి వివరించాలని రైతులు కోరుతున్నారు. గతంలో వరిపంటకు ఇంత త్వరగా మొగిపురుగు ఆశించడం చూడలేదని పలువురు రైతులు తెలిపారు.



## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ

రామకృష్ణాపూర్,ఆగష్టు 08 (మనం న్యూస్): రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన సర్వర్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా చెన్నూరు నియోజకవర్గ పిసిసి సభ్యులు నూకల రమేష్ మంగళవారం పరామర్శించి వారి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణమైనారిటీ అధ్యక్షులు లాడెన్, రామ్ సాయి, అనిరుద్, నవీన్,జనగామ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అద్యక్షులు జాడి రాజేందర్ హాజు,సమ్మయ్య, మండల సమ్మయ్య, కటవేన రాజాం, శేఖర్ పాల్గొన్నారు.

## రైతులు పొలాలకు వెళ్లే బండ్ల బాట మార్గంలోనే

## విధ్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

### యువరైతు బొంగోని రవి గౌడ్



వీణవంక-ఆగష్టు 08(మనం న్యూస్): రైతులు పొలాలకు వెళ్లే బండ్ల బాట మార్గంలోనే పెద్ద విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన యువరైతు బొంగోని రవి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల మధ్యలో పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వలన అవి కాలిపోయినప్పుడు వాటి మరమ్మతు కొరకు పొలాల్లో నుండి అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి బయటకు తీసుకురావడం జరుగుతుందని అదే సమయంలో కొందరు రైతులు తమ పొలం పాడవుతుందని తీవ్ర అభ్యంతరం తెలుపగా రైతుల మధ్య విబేధాలకు తావిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పొలాలల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు వెళ్లే బండ్ల బాట మార్గంలో ఒక వైపు ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి కెసీ ఆర్ తక్షణమే జిల్లా ఉన్నత విధ్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ఒక వేళ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు తీసుకెళ్లడానికి సులువుగా ఉంటుందని, రైతుల పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గ సమావేశం



ఆర్మూర్, ఆగస్టు 8 (మనం న్యూస్): ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు సాయిబాబ గౌడ్ అధ్యక్షతన మంగళవారం పట్టణ, మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్, పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం చంద్రమోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గానికి కంచుకోట అని, సురేష్ రెడ్డి, ఆకుల లలిత వంటి నాయకులు పార్టీ వదిలి వెళ్లి పోవటంతో కొద్దిగా బలహీన పడిన మాట వాస్తవమన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాల్లో ఇక్కడ ఉన్న నాయకులు కార్యకర్తలు పార్టీ ఏ పిలుపు ఇచ్చిన విజయవంతం చేశారు అని, అధికార పార్టీ ఎమ్మెల్యే కేసులతో కక్షసాధించిన వేధించిన తట్టుకొని పార్టీని కాపాడారన్నారు. ఎన్నికలు వస్తున్నాయి అంటే మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ది పొందాలని బిజెపి చూస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దౌర్జన్యం దోపిడీ ఎక్కువ అయ్యాయని, ఎంపి అరవింద్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఇక్కడ కుస్తీ హైదరాబాద్ లో దోస్తీ చేస్తూ ఫైవ్ స్టార్ హోటల్లో మీటింగ్లు పెట్టుకుంటూ పార్టీలు చేసుకుంటు కాంగ్రెస్ పార్టీని గెలవకుండా ఒక్కటి అయ్యారని ఆరోపించారు. రానున్న ఎన్నికలో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చిన కలిసి పని చేసి ఘన విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ రానున్న 100 రోజులు మనకు కీలకం అని ఈరోజు ఇక్కడ ఉన్న మీ వల్లే పార్టీ బలంగా ఉందని, ఆ బలం చూసి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుండటంతో పార్టీలో చేరటానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ టికెట్ కొరకు చాలా మంది ఆశావాహులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఇప్పటినుండి అభ్యర్థి ఎవరు అని చూడకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ జెండా కింద పార్టీ గెలుపు కోసం పని చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబా ఖాన్, గంగాధర్ గౌడ్,విట్టం జీవన్, వెంకట్రాంరెడ్డి, మీర్ మాజీద్, రాజేశ్వర్, ముక్కెర విజయ్, భూమేశ్వర్, చిన్నారెడ్డి, రవి ప్రకాష్, మహమూడ్ అలీ, ప్రమోద్, మంథని చిన్నారెడ్డి, జిమ్మి రవి, మందుల పోశెట్టి, మీసాల రవి, బట్టు శంకర్, కిషన్, ప్రవీణ్, రవి,మల్లారెడ్డి, అమృత్ రావు, గంగాధర్, నర్సారెడ్డి, పాషా, హబీబ్, ఉదయ్, ప్రసాద్, పోశెట్టి, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, భావేశ, విజయ్, కిషోర్, సల్మాన్, సోహైల్, శ్రీనివాస్, భగత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు అఖిల్, రాజేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ సమీక్షా సమావేశం



చొప్పదండి, ఆగస్టు 8 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చిలుక రవీందర్ అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ చొప్పదండి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2020 నుండి 2023వ సంవత్సరం వరకు చేపట్టిన పనులు చాలావరకు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. పనుల ఆలస్యం కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి విడుదలయ్యే నిధులు రాకుండాపోయే అవకాశాలున్నాయన్నారు. వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ రాజ్ ఇంజనీర్‌కు సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడివో స్వరూప, వైస్ ఎంపిపి మునిగాల విజయలక్ష్మి, ఏపిఆర్ విజయ సారధి, ఎంపిటిసి సభ్యులు గోపు మంగమ్మ నరేందర్ రెడ్డి, కట్టెకోల తార లక్ష్మయ్య, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాలందించిన తిరుపతిరెడ్డి



ఇల్లందకుంట, ఆగస్టు 8 (మనం న్యూస్)ః ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంచెత్తి ఇండ్ల లోకి నీరు వచ్చి నిత్యావసర వస్తువులు తడిసి ముద్దైన కుటుంబాలకు బిజేపి మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి మంగళవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ శాసన సభ్యులు ఈటెల రాజేందర్ ఆదేశాల మేరకు వరద బాధితులకు బియ్యం, నూనె, పప్పు దినుసులతో పాటు ఇతర నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్,ప్యాక్స్ చైర్మన్ కళ్లెం సత్యనారాయణ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల రమేష్,మల్యాల సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, పాతర్లపల్లి గ్రామ సర్పంచ్ రామ్ మల్లయ్య, మట్ట పవన్ రెడ్డి, కమ్మగోని అజయ్,అబ్బిడి శ్రీపతిరెడ్డి, రామ్ శివ ,కొడారి మల్లయ్య,కొడారి ఓదెలు,కొడారి రమేష్,కోడం పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బల్మూరి వెంకట్



ఇల్లందకుంట, ఆగస్టు 8 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి బల్మూరి వెంకట్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండలంలోని లక్ష్మాజిపల్లి, సిరిసేడు, సీతంపేట, బుజునూర్, వంతడుపుల టేకుర్తి, మల్లన్న పల్లి, గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ నాయకులు వంగ రామకృష్ణ, సింగి రెడ్డి గోపాల్ రెడ్డి, గొడిషల పరమేష్, ఉప్పుల శ్రీనివాస్ నేరెళ్ళ సందీప్ గౌడ్, రెడ్డి సతీష్, కిషన్ రెడ్డి, రాంరెడ్డి, ముద్రబోయిన రాములు, పసునూటి అన్వేష్, భోగం సాయిరాం, అజయ్‌లు పాల్గొన్నారు.

## అనాధ ఆశ్రమంలో హైకోర్టు న్యాయవాది జన్మదిన వేడుకలు



కొత్తపల్లి, ఆగస్టు 8 (మనం న్యూస్)ః హైదరాబాద్‌లోని ఉప్పల్ కురుమ నగర్ కు చెందిన హై కోర్టు న్యాయవాది నోముల ప్రసన్నకుమార్ జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అనాధ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనాధ వృద్ధులకు భోజనాలతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పట్టణ నాయకులు పెంటి రాజమౌళి, రుద్ర పరం, ఎలకపల్లి రమేష్, పెంటి శ్రీకాంత్, భూష విజ్జు గౌడ్,పేంటీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## గనులపై గద్దర్‌కు ఘన నివాళి

రామకృష్ణాపూర్, ఆగస్టు 8 (మనం న్యూస్): ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్ మృతి సందర్భంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ గనులపై శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు అక్బర్ అలీ మాట్లాడుతూ గద్దర్ పోరాటాలు త్యాగాలను గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల వేజ్ బోర్డు సమ్మెల్లో తెలంగాణ పోరాటం లో స్తబ్దత ఏర్పడినప్పుడు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం ద్వారా మణుగూరు నుండి గొలేటి వరకూ గని గని తిరిగి ఉద్యమం ఉపందుకునే విధంగా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఆర్‌కెపి సోషల్ మీడియా ఇంచార్జ్ గోవిందుల రమేష్, ఆర్‌కె ఓసిపి పిట్ కార్యదర్శి ఏ.ఆంజనేయులు, మైనింగ్ ఇంఛార్జి వి.రాజేశ్వరరావు, ఆర్ కె1ఏ పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్ కుమార్, సిహెచ్ పి.పిట్ కార్యదర్శి సంజీవ్, కమిటీ సభ్యులు గాజుల రాయమల్లు, రామకృష్ణ, రమేశ్, రాజేందర్, సంపత్, దేవసహాయం,ఏరియా హాస్పిటల్ రామారావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట రెండవ ఏఎన్ఎంల నిరసన



చిగురుమామిడి, ఆగస్టు 8 (మనం న్యూస్)ః తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట రెండవ ఏఎన్ఎంలు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలుగా గత 15 సంవత్సరాలుగా పీహెచ్సీల్లో పనిచేస్తున్నప్పటికీ నేటి వరకు తమను పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందన్నారు. ఇప్పటికైనా తమను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కారం చేసి, ఉద్యోగాల్ని పర్మినెంట్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపించారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంలు గాలిపెల్లి స్వరూప, పన్యాల రజిత, జెల్ల కవిత, రాజేశ్వరి, భూక్య స్వాతి, రొంటాలా శైలజ, అంతడుపుల సరస్వతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని లక్ష్మీరాజం బంధువుల రాస్తారోకో



కోరుట్ల, ఆగస్టు 7 (మనం న్యూస్)ః బిఆర్ఎస్ కౌన్సిలర్ భర్త లక్ష్మీ రాజం ను చంపిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుని బంధువులు మంగళవారం సాయంత్రం మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు బైఠాయించిన బంధువులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. నచ్చ చెప్పాలని చూసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా సాగర్ అనే యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. హత్యకు పాల్పడ్డవారిని పట్టుకుని న్యాయస్థానం ముందు నిలబెడతామని సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్‌లు హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

## అనాధ బాలున్ని అక్కున చేర్చుకున్న ఇటలీ దంపతులు

### కరీంనగర్ శిశు గృహ నుండి బాలుడి దత్తత



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః కరీంనగర్ శిశు గృహలో ఉంటోన్న బాలున్ని ఇటలీ నుంచి వచ్చిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా 10 ఏళ్ల వయసు ఉన్న బాలుడిని స్పెషలైజ్డ్ అడాప్షన్ ప్రోగ్రాం ద్వారా కలెక్టర్ బి.గోపి సమక్షంలో అధికారులు వారికి మంగళవారం అప్పగించారు. దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన దంపతుల వద్ద బాలుని పర్యవేక్షణ బాధ్యతలు తామే చూసుకుంటామని ప్రతి మూడు నెలలకోసారి అతని బాగోగులకు సంబంధించిన వివరాలను పంపిస్తామని ఇటలీకి చెందిన ఏజెన్సీ ప్రతినిధి ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. అయితే ఇటలీ దంపతులు దత్తత తీసుకుంటున్నందున వారితో వెళ్లేందుకు సుముఖంగా ఉన్నావా అని సదరు బాలున్ని కలెక్టర్ ప్రశ్నించగా ఆయన సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే తరుచూ బాలునితో మాట్లాడుతూ అతని యోగ క్షేమాలపై ఆరా తీయాలని మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ గోపి ఆదేశించారు. ఈ దత్తత కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, సిబ్బంది శాంత, తిరుపతి, రాజు, తేజస్వీ, కవిత, రాజ్ కుమార్, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైగా ఎంపికైన స్వాతికి మై వేములవాడ ట్రస్ట్ సత్కారం




వేములవాడ టౌన్, ఆగస్ట్ 8 (మనం న్యూస్): ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల స్వాతిని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. భవిష్యత్తులో స్వాతి ఇంకా ఎన్నో ఉన్నత పదోన్నతులు అధిరోహించి, ఎక్కడ ఉన్నా వేములవాడ పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, నగుబోతు రవీందర్, ప్రతాప నటరాజు, పొలాస రాజేందర్, జూలపల్లి రాజు, నక్క వేణు, నాగుల చంద్రశేఖర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, నంది సాయికుమార్, స్వాతి కుటుంబ సభ్యులు కొప్పుల లింగమూర్తి, పావని, కృష్ణమూర్తి, ఉమ, గణేష్, గీత, శ్రీనివాస్, లత తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాలో కెటిఆర్ పర్యటన




### ఐటి హబ్, ఎన్ఎంసి కార్యాలయం, మినీ ట్యాంక్ బండ్‌ల ప్రారంభానికి సర్వం సిద్ధం.

### - ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్, సిపి

నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 8 (మనం న్యూస్): రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఐటి హబ్ ను ప్రారంభించనున్నారు. అలాగే ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయ భవనాన్ని, దుబ్బ, వర్ని రోడ్డు, అర్సపల్లి ప్రాంతాల్లో నిర్మించిన వైకుంఠధామాలను, నగరపాలక సంస్థ నూతన భవనాన్ని, ఖిల్లా రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్‌లకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే మున్సిపల్ కార్మికులతో కలిసి శ్రీ రామ గార్డెన్ లో సహపంక్తి భోజనం చేయనున్నారు. కెటిఆర్ పర్యటనను పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, నగర మేయర్ దండు నీతూకిరణ్, కమిషనర్ ఎం.మకరంద్ లతో కలిసి ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్ మంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా మంత్రి హాజరవుతుండడంతో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని



హెలిప్యాడ్ ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా మంత్రి కేటీఆర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసి సభ్యులు బాజిరెడ్డి జగన్, అదనపు డీసీపీ జయరాం, ఏ.సి.పి కిరణ్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురళీ మనోహర్ రెడ్డి, నగర పాలక సంస్థ ఇంజినీర్ రషీద్, ట్రాన్స్ కో ఏ.డీ.ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై డిఇవోకు ఫిర్యాదు



నిజామాబాద్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః ఆర్మూర్ పట్టణానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు సత్య రమేష్, టి.సునీతలు సిఎస్ఐ చర్చిలో కీలక పదవులు నిర్వహిస్తూ మత ప్రచారం చేస్తున్నారని రాపల్లి సుకుమార్ దీపక్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సత్య రమేష్, ఆర్మూర్ లోని సైదాబాద్ కాలనీలో గల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న టి.సునీత సిఎస్ఐ సెంట్ పీటర్ చర్చిలో కీలక పదవుల్లో ఉన్నారన్నారు. సత్య రమేష్ చర్చ్ లో స్టువర్డ్ గా, టి. సునీత చర్చిలో సండే స్కూల్ టీచర్ గా పని చేస్తున్నారన్నారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించామని పేర్కొంటూ నిజమైన క్రైస్తవులను చర్చి పదవుల నుంచి తొలగిస్తున్నారన్నారు. వీరు మత ప్రచారం చేస్తున్నారని వీరికి పాస్టర్ అండగా నిలుస్తున్నారు. చర్చిలోనీ అకౌంట్స్ లో అవకతవకలు జరగడానికి వీరు సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన వీరిద్దరిపై చర్యలు తీసుకొని నిజమైన క్రైస్తవులకు న్యాయం చేయాలన్నారు.



## నిరుపేద సరస్వతి పుత్రునికి ఎమ్మెల్సీ కవిత చేయూత

నిజామాబాద్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి ఉదారతను చాటుకున్నారు. నిజామాబాద్ కు చెందిన ఓ నిరుపేద యువకునికి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని ప్రదర్శించారు. నగరానికి చెందిన సామల రితీష్ కు అమెరికాలోని నార్త్ వెస్ట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు లభించింది. కానీ చిరు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించే రితీష్ తండ్రి తన కొడుకుని అమెరికాకు పంపించే స్తోమత లేక ఇబ్బందుల పాలవుతున్నారు. తన పరిస్థితిని వివరిస్తూ రితీష్ కవితను ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన ఆమె సదరు యువకుడు అమెరికాకు వెళ్లేందుకు అవసరమయ్యే ఖర్చును భరిస్తూ, సొంత ఖర్చులతో విమాన టికెట్లను అందించారు. ఈ సందర్భంగా రితీష్ మాట్లాడుతూ తన కలను సాకారం చేసుకునేందుకు ఆర్థికంగా చేయూతనందించిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపారు.

# నిజామాబాద్

## ముదిరాజ్ లకు ఎమ్మెల్యే బాజి రెడ్డి చేయూత





నిజామాబాద్ రూరల్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః నిజామాబాద్ రూరల్ మండలం చల్లగర్గ గ్రామ పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 10 లక్షలు రూపాయలు మంజూరు చేశారు. గుడి నిర్మాణానికి సహకరించాల్సిందిగా చల్లగర్గ ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేను కోరగా, స్పందించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి వెంటనే నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



బోధన్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః సంఘటితం, సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం ఈ నెల 13న జరిగే ఛలో కోరుట్ల పద్మశాలి బహిరంగ సభ పోస్టర్‌ను జిల్లా పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి పులగం హనుమాండ్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మెరుగు లక్ష్మీనారాయణ,లోల శంకర్,గంగుల లక్ష్మణ్,బోధన్ నియోజకవర్గ పద్మశాలి అధ్యక్షుడు మేక సంతోష్, ప్రధానకార్యదర్శి లోకం శ్రీనివాస్,బోధన్ పట్టణ పద్మశాలి అధ్యక్షుడు గంగుల దేవిదాస్,బోధన్ మండల అధ్యక్షుడు రవీందర్,ఎడపల్లి మండల అధ్యక్షుడు గజం అనంత స్వామి,జిల్లా యువజన కార్యవర్గ సభ్యులు బొడ్డు సురేష్, కౌన్సిలర్ వినోద్, ప్రచార కార్యదర్శి గొనె ప్రవీణ్ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

## సెల్ టవర్ పైన ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నిజామాబాద్ రూరల్, ఆగస్టు 8 (మనం న్యూస్)ః నిజామాబాద్ నగర శివారులోని ఖానాపూర్ వ్యవసాయ భూమిలోని సెల్ టవర్ పైకి ఎక్కి ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుబ్బాలోని పవన్ నగర్ ప్రాంతానికి చెందిన నవీన్ (33) గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. గత మూడు నెలలుగా వేతనం రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఇందుకు తోడు అనారోగ్య సమస్య ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో జీవితం పై విరక్తి చెంది ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఇంటి నుండి వెళ్లిన నవీన్ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఉదయం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకుతుండగా ఖానాపూర్ శివారులోని వ్యవసాయ భూమిలో పైకెక్కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంచ నామా నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడు నవీన్ కు భార్య ఇద్దరు కుమారులున్నారు.